# పుస్తక పరిచయం




**వర్తమాన** కథా రచయితల్లో ఒక స్థాయి కల రచనలు చేస్తున్న రచయిత డా.కె.వి.రమణరావుగారు. ఆయన వ్రాసిన 26 కథల సంపుటి ఈ ‘పుట్టిల్లు‘. ఆలోచన ఈయన కథలకి ఆయువుపట్టు. ఏ కథా ఏదో సరదాగా వ్రాసినట్లుండదు. ప్రతి కథా ఎంతో ఆలోచనతో ఏదో ఒక ప్రయోజనాన్ని ఆశించి వ్రాసినట్లుంటుంది. ఉండడమే కాదు ఆ ప్రయోజనాన్ని సిద్ధింపచేస్తుంది కూడా. రచయిత ఆలోచన, పాఠకుడిలో ఆలోచనలు రేకిత్తించగలిగితే ఆ రచయిత ఆశయం ఫలించినట్లే. ఈ కోణంలో నుంచి చూస్తే రమణరావుగారి కథలు నూటికి నూరుశాతం విజయవంతమైన కథలు అని చెప్పుకోవచ్చు. ఈ పుస్తకానికి శీర్షిక ఐన‘ పుట్టిల్లు‘ కథ మనసుల్ని సున్నితంగా తట్టే కథ. ముగింపు కొంచెం అసహాజం అనిపించినా అది రచయిత సూత్రప్రాయంగా తెలియచేసిన పరిష్కారం అనుకోవచ్చు. పల్లెటూరిని ఎప్పుడో వదిలేసిన వచ్చిన మలి వయసు మహిళ, పుట్టిన వూరిలోని తన చిన్ననాటి స్నేహితురాళ్ళు ఆ వయసులో పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని, తానూ ఆ పుట్టిన వూరికే వెళ్ళిపోయి, వాళ్ళకి సహాయం చెయ్యాలనుకోవడం ఈ కథా ఇతివృత్తం. చివరలోవ్రాసిన వాక్యం "ఒక వేళ ఈ ప్రయత్నంలో నేను ఓడిపోతే మీకు భారం కాను" మనసుని సున్నితంగా తడుతుంది. ఇలాంటి ముగింపుల్లోనే రచయిత ప్రత్యేకత కనిపిస్తుంది. ‘పారిజాతం పూలవాసన మంచులా చిక్కగా కమ్ముకుని సప్తమినాటి చంద్రుడు మసకేశాడు‘ లాంటి వాక్యాలు కవితాత్మ కల పాఠకులని కట్టి పడేస్తాయి. ‘వెన్నెల వెలుగు ‘ కథ చదువుతుంటే ఆయా ప్రదేశాలు మన కళ్ళముందు కదులుతాయి, ఆ పాత్రతో మనమూ మమేకమౌతాం. ఎక్కువ చెప్పకుండా ముగింపులో ఎన్నో అర్థాలని పలికించిన కథ ‘పరుగుపందెం‘. ఏ కథ చదివినా ఆ కథల్లోని వాతావరణ చిత్రణ పాఠకుడ్ని అక్కడికి తీసుకెళ్తుంది. ప్రతి కథలోనూ హృదయం ఉంది, ఆర్తి ఉంది, సమాజక్షేమంకోసం,వ్యక్తి వికాసం కోసం రచయిత పడే తపన ఉంది. మంచి కథలు, గుర్తుంచుకోదగ్గ కథలు, ప్రయోజనాత్మకమైన కథలు వ్రాస్తున్న డా.రమణరావుగారి కలం నుంచి మరిన్ని కథలు రావాలని కోరుకుందాం.

★★★

***Publishers:***

*Vishalandhra Publishing House*
Giriprasad Bhavan, Bandlaguda(Nagol)
GSI Post, Hyderabad – 68
www.visalaandhra.net




E-Publishers:
Aparajita Publications

For copies:
Kingie.com

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**

**అలనాటి** ఆకాశవాణితో పరిచయమున్న వారందరికీ ఉషశ్రీగారిని వేరేగా పరిచయం చెయ్యాల్సిన అవసరం లేదు. ఆ ఉషశ్రీగారి కుమార్తె డా.గాయత్రీదేవిగారు. తండ్రిగారి సాహితీవారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న గాయత్రీదేవిగారు అరుదుగా వ్రాసినా చక్కటి కథలు వ్రాశారు. ఆమె ప్రముఖ ఆయుర్వేద వైద్యురాలిగా పత్రికలద్వారా, టీవీల ద్వారా ఆంధ్రదేశంలోనీ, విదేశాల్లోనీ తెలుగువారందరికీ చిరపరిచితులే. డా.గాయత్రీదేవిగారు వ్రాసిన 25 హాస్యకథల / మామూలు కథల సంపుటి ఈ 'హాస్యాహాస్య కథలు'. అచ్చుపుస్తకంగా కాకుండా డిజిటల్ పుస్తకంగా (ఇ-పుస్తకంగా) కినిగె.కామ్ వారి ద్వారా విడుదలచేయబడింది. చక్కటి ముఖచిత్రం, అందమైన కూర్పు కాబట్టి ఇ-పుస్తకమైనా ప్రింట్ పుస్తకం చదువుతున్నట్లే ఉంటుంది. ఈ కథల్లో పగలబడి నవ్వించే హాస్యం కంటే అర్థవంతమైన, ఉపయోగకరమైన, చతురోక్తుల్లాంటి హాస్యం ఎక్కువగా ఉంది. హాస్యకథల్లో ప్రయోజకతని జోడించడం డా.గాయత్రీదేవిగారు చేసిన అద్భుతమైన ప్రయోగం. సాధారణంగా పౌరాణిక పాత్రలతో హాస్యాన్ని సృష్టించాలనుకున్నప్పుడు ఆయా పాత్రలని కొంచెం వెకిలిగా చిత్రించడం పరిపాటి, కానీ రచయిత్రి తన మొట్టమొదటి కథలో దేవేంద్రుడు, భూదేవి, ఊర్వశి పాత్రలతో కథ అల్లినా ఎంతో చక్కటి అంశాన్ని ఆయాపాత్రల ద్వారా ఉదాత్తంగా చెప్పించారు. మనుషులు బరువుతగ్గితే, స్లిమ్‌గా ఉంటారు, తద్వారా భూభారం తగ్గుతుంది అనేది మొదటి కథ ' ఊర్వశీ.. పాలసీ..' లో ఇతివృత్తం. తాము ఎలా పెరిగినా, ఏం సాధించలేకపోయినా పిల్లలు మాత్రం ప్రపంచంలోని అన్నిరంగాల వ్యక్తుల్లా అర్జంటుగా పేరుతెచ్చుకోవాలని తాపత్రయపడే తల్లిదండ్రులకు చక్కటి చురక - 'కన్న' వారి కలలు. ముగింపువాక్యం అందర్నీ ఆలోచింపచేస్తుంది. 'భామాకలాపం' అద్భుతమైన కథనంతో అందరికీ తెలిసిన కృష్ణ-సత్యభామల కథకి ఓ అందమైన ముగింపుతో కూర్చిన కథ. సరళమైన వాక్యశైలి, సన్నివేశ చిత్రీకరణ ఈ కథలకి ఉన్న మరో చక్కటి గుణం. పాఠకులని అలవోకగా చదివింపచేసే ఈ కథలు కాలక్షేపానికి, చిరునవ్వులకే పరిమితంకాకుండా ఏదో ఒక అర్థవంతమైన అంశాలు తమలో పొదువుకున్నాయి. ఈ సరికొత్త శైలిలో, సున్నితమైన హాస్యంతో సాగిన ఈ హాస్యకథల / మామూలు కథల రచయిత్రి డా.గాయత్రీదేవిగారు అభినందనీయులు.

***